బాలిక ప్రాణం ఖరీదు 13.50 లక్షలు ?

- రాజకీయ నేతల మధ్య తెగిన పంచాయితీ!
- పోలీసులకు ముడుపులు అందినట్టు ఆరోపణలు

గద్వాల అర్బన్, అక్టోబర్ 24 : చేయని తప్పునకు ఓ రాజకీయ నాయకుడు నింద మోపడంతో అవమానం భరించలేక బాలిక ఆత్మహత్య చేసుకొంది. అప్రమత్తమైన సదరు నాయకుడు బాలిక ప్రాణానికి ఖరీదు కట్టాడు. వివరాలిలా.. మల్దకల్ మండలం బిజ్వారం గ్రామానికి చెందిన వడ్డె కవిత కూతురు వడ్డె రాజేశ్వరి(16) గద్వాల జిల్లా కేంద్రంలోని ఓ రాజకీయ నేత ఇంట్లో పని మనిషిగా ఐదేండ్లుగా పనిచేస్తున్నది. మూడు నెలల కిందట ఇంట్లో బంగారం పోయిందంటూ సదరు నేత కుటుంబ సభ్యులు హడావుడి చేసి పనిమనిషిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఆమెను పని నుంచి తొలగించడంతోపాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. 'ఆ తర్వాత బంగారం దొరికిందంటూ ఒకసారి.. మరికొద్దిరోజులకు మొత్తం లభించలేదని, మీరే తీశారు' అంటూ సదరు బాలిక కుటుంబీకులను హెచ్చరించారు. దీంతో దొంగతనం నింద తనపై పడటంతో అవమానంతో పదిరోజుల కిందట పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. వెంటనే కుటుంబ సభ్యులు కర్నూల్ దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతిపై ప్రజా సంఘాలు, రాజకీయ నాయకులు స్పందించి ఘటనకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అప్రమత్తమైన సదరు రాజకీయ నేత తన పలుకుబడితో బాలిక ప్రాణానికి ఖరీదు కట్టారు. గురువారం జిల్లా కేంద్రంలో పంచాయితీ పెట్టగా.. పలువురు రాజకీయ నాయకుల మధ్య బాలిక కుటుంబానికి రూ.1 3.50 లక్షలు ఇచ్చేలా ఒప్పందం కుదిర్చినట్టు సమాచారం. విషయం బయటకు పొక్కకుండా ఉండేందుకు పోలీస్, కొందరు మీడియా ప్రతినిధులకు పెద్ద మొత్తంలో ముడుపులు అందించినట్టు తెలిసింది. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా.. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'ఆమె' భరోసాకు పదేండ్లు

ఆకతాయిల్ని వేటాడే నిఘా నేత్రం

- కేసీఆర్ ఆలోచనకు ప్రతిరూపం
- మహిళా భద్రతకు పాశుపతాస్త్రం
- దశాబ్దం పూర్తి చేసుకున్న షీ టీమ్స్
- దశాబ్ద కాలంలో అనేక విజయాలు
- దేశానికే ఆదర్శంగా నిలిచిన షీ టీమ్స్

హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): ప్రత్యేక రాష్ట్రంలో పాలన పగ్గాలు చేపట్టిన తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యతనిచ్చారు. మహిళలపై దాడులు, అఘాయిత్యాల్ని అరికట్టేందుకు అద్భుతమైన ఆలోచన చేశారు. అదే షీ టీమ్స్ ఏర్పాటు. బహిరంగ ప్రదేశాల్లో మహిళలకు ఆకతాయిల వేధింపుల నుంచి రక్షణ కల్పించేందుకు ప్రత్యేక విభాగాన్ని తీసుకొచ్చారు. సిబ్బందిని కేటాయించి, మహిళలను వేధించేవారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకునేలా శిక్షణ ఇప్పించారు. హైదరాబాద్‌లో విజయవంతమైన ఇలాంటి విభాగాల్ని అన్ని జిల్లాలకు విస్తరించారు. పోలీసులకు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వడం, సాంకేతికతను ఉపయోగించి ఆకతాయిలను అరికట్టడంతో బీఆర్ఎస్ ప్రభుత్వం సఫలీకృతమైంది. దీంతో షీటీమ్స్ అంటేనే ఆకతాయిలు హడలిపోయేలా కేసీఆర్ పదేళ్ల పాలన సాగింది. 2018లో ఏర్పడిన ఉమెన్ సేఫ్టీ వింగ్ విభాగంలో భాగస్వామిగా.. చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ మహిళలను ఆపదలో రక్షించే ఓ ప్రత్యేక వ్యవస్థగా షీటీమ్స్ నిలిచింది. దేశ, విదేశాలల్లో మన షీటీమ్స్ ఘనతను, మహిళల పట్ల వేధింపులను అరికట్టే విధానాన్ని కొనియాడారు. పదేండ్లలో 66,617 ఫిర్యాదులు అందగా.. 6,319 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి.

2014 నుంచి 2024 వరకు	
ఫిర్యాదులు	66,617
ఎఫ్ఐఆర్‌లు	6,319
పెట్టీ కేసులు	17,460
కౌన్సెలింగ్	15,343
మైనర్లకు హెచ్చరిక	16,169
రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నవి	13,895

ఎప్పుడైనా... ఎక్కడైనా... షీ టీమ్స్

'ఫ్రెండ్లీ పోలీసింగ్' విధానంతో మహిళలకు పూర్తిగా సురక్షితమైన వాతావరణాన్ని అందించాలనే ఉద్దేశంతో 2014 అక్టోబర్ 24న మొదట హైదరాబాద్ నగరంలో షీ టీమ్స్ ప్రారంభించారు. హైదరాబాద్ నగరంలో షీ టీమ్స్ సాధించిన అద్భుతమైన విజయాన్ని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్రం అంతటా విస్తరించారు. ప్రజల నుంచి విశేషమైన స్పందన, సురక్షితమైన, పెట్టుబడుకు స్నేహపూర్వక నగరంగా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌కి బలమైన సహకారం అందించడంలో షీటీమ్స్ పాత్ర కూడా ఉంది. ప్రస్తుతం తెలంగాణలోని ప్రతీ జిల్లాలో షీ టీమ్స్ పని చేస్తున్నాయి. భవిష్యత్తులో వాటిని అన్ని పోలీసు సబ్ డివిజన్‌లు, పోలీస్ స్టేషన్‌లకు విస్తరించాలనుకుంటున్నట్టు ఉమెన్ సేఫ్టీ వింగ్ డీజీ శిఖాగోయెల్ చెప్పారు. ప్రస్తుతం 30 పోలీసు యూనిట్లలో 328 మంది అధికారులు షీ టీమ్స్‌లో పనిచేస్తున్నారని ఆమె తెలిపారు.

షీటీమ్స్ కీలక విజయాలు..

- షీటీమ్ అప్లికేషన్ సాఫ్ట్‌వేర్ మొత్తం 30 యూనిట్లకు విస్తరణ.
- 2021 నుంచి దాదాపు 6,157 ఆన్‌లైన్ పిటిషన్ల స్వీకరణ.
- వాట్సాప్ నెంబర్ 871265685 2024లో 549 ఫిర్యాదులు.
- ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్ ద్వారా ఫిర్యాదులు స్వీకరణ.
- పబ్లిక్ ప్లేస్‌లలో 40వేలకు పైగా క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు అతికింపు.
- మెట్రో స్టేషన్లలో మొత్తం 424 ఫిర్యాదులు, క్యూఆర్ కోడ్ ద్వారా 84 ఫిర్యాదులు.
- 2020లో ఆన్‌లైన్ ద్వారా 10 కౌన్సెలింగ్ సెషన్ నిర్వహణ. 4,488 మందికి కౌన్సెలింగ్.(4,176 మంది పెద్దలు, 312 మంది మైనర్లు)

'స్థానికం'లో బీసీ కోటాకు పాతర!

మొదటిపేజీ తరువాయి...

రిజర్వేషన్లు అమలు చేయకుండా పాతర వేసేలా తెరవెనుక ప్రయత్నాలు చేస్తోంది. రిజర్వేషన్ల స్థిరీకరణకు డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేయకపోవడమే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. నయవంచక రేవంత్ రెడ్డి సర్కారు కుయుక్తులను గ్రహించిన బీసీ సంఘాల పెద్దలు, మేధావులు ఇలాంటి ఆటలు సాగనివ్వమని గళమెత్తుతున్నారు. డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేసేంత వరకు అవిశ్రాంత పోరాటం చేస్తామని తేల్చిచెబుతున్నారు.

కడుపులో కత్తులు... కంటితుడుపు చర్యలు

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు గల్లంతు చేసేందుకు రేవంత్ సర్కారు ఎత్తులు వేసింది. బీసీ రిజర్వేషన్ల స్థిరీకరణ బాధ్యతలను రాష్ట్ర బీసీ కమిషన్‌కు అప్పగించడం ఇందుకు నిదర్శనం. ఇందులో దాగి ఉన్న కుట్ర బహిర్గతమవుతున్నది. సుప్రీం కోర్టు తీర్పులు, వివిధ రాష్ట్రాల ప్రభుత్వాల అనుభవాలు చూస్తుంటే కాంగ్రెస్ సర్కారు కడుపులో కత్తులు పెట్టుకుని పైకి కంటి తుడుపు చర్యలు చేపడుతున్నదని అర్థం చేసుకోవచ్చు. వాస్తవంగా బీసీ రిజర్వేషన్ల స్థిరీకరణ అనేది బీసీ కమిషన్‌తో సాధ్యం కాదు. ఇందుకోసం డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వక అజ్ఞానాన్ని, అవగాహన రాహిత్యాన్ని ప్రదర్శిస్తున్నది. బీసీల రిజర్వేషన్లకు అసలుకే ఎసరు తేవడమే అసలు కుట్ర.

బీసీ కమిషన్.. డెడికేటెడ్ కమిషన్ వేర్వేరు

బీసీ స్థితిగతులపై మండల్ కమిషన్ పలు సిఫారసులను చేసింది. ఇందులో ముఖ్యమైంది బీసీలకు విద్య, ఉద్యోగ రంగాల్లో 27శాతం రిజర్వేషన్ల అమలు. సిఫారసు అమలులో కోసం బీసీ కులాల జాబితాల్లో కులాల చేరిక, తొలగింపు చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు జాతీయస్థాయిలో 1993లో బీసీ కమిషన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం చట్టం చేసింది. ఆ చట్టాన్ని దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు యథాతథంగా అమలు చేసేందుకు చట్టాలను రూపొందించుకున్నాయి. అయితే బీసీ కమిషన్ చట్టంలో ఎక్కడా కూడా రాజకీయ రిజర్వేషన్ల గురించి ప్రస్తావన లేదు. చట్టాన్ని సరిగ్గా అర్థం చేసుకోని కొన్ని రాష్ట్రాలు అసెంబ్లీల్లో తప్పటడుగులు వేసి, న్యాయస్థానాల్లో చతికిలపడ్డాయి

చట్టాన్ని అర్థం చేసుకోలేక...

కర్నాటక రాష్ట్ర సర్కారు స్థానిక సంస్థల్లో బీసీలకు కల్పించిన రిజర్వేషన్లను కేఈ కృష్ణమూర్తి సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. బీసీ రిజర్వేషన్ల స్థిరీకరణకు సుప్రీం కోర్టు ట్రిపుల్ టీ పేరిట మార్గదర్శకాలు జారీ చేసింది. కేవలం రిజర్వేషన్ల స్థిరీకరణకు స్వతంత్ర, డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేయాలని, ఆ కమిషనే గ్రామస్థాయిలో డాటా సేకరించి, సూక్ష్మ, సమగ్ర అధ్యయనం చేసి రిజర్వేషన్లను నిర్ణయించాలని తేల్చిచెప్పింది. ఇక మహారాష్ట్ర కూడా ఇలాగే తప్పటడుగు వేసింది. డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేయకుండా 2021లో ఆ రాష్ట్ర బీసీ కమిషన్ చట్టంలో మార్పులు చేసింది. రాజకీయ రిజర్వేషన్ల స్థిరీకరణ కోసం సర్వే అధికారాలను కల్పిస్తూ సవరణలు చేసుకుంది. ఈ మేరకు 2022లో మహారాష్ట్ర బీసీ కమిషన్ రిజర్వేషన్ల స్థిరీకరణ రిపోర్టును ఆ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించింది. కానీ మహారాష్ట్రకు చెందిన పలువురు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. సుప్రీంకోర్టు సైతం మహారాష్ట్ర సర్కారు సమర్పించిన నివేదిక చెల్లబోదంటూ తేల్చిచెప్పింది.

అసలుకే ఎసరు పెట్టేందుకు సర్కారు కుట్ర

రాజ్యాంగపరమైన హక్కులు ఉన్న నేపథ్యంలో స్థానిక సంస్థల్లో ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లను కల్పిస్తున్నారు. ఆర్టికల్ 243డీ నుంచి డీ (5), ఆర్టికల్ 243 టీ(1) నుంచి ఆర్టికల్ టీ (5) పంచాయతీరాజ్, మున్సిపల్ ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు సంబంధించి మార్గదర్శకాలను నిర్దేశిస్తున్నాయి. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి అధికారాలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు కల్పిస్తూ ఆర్టికల్ 243 డీ (6)కింద పొందుపరిచింది. అయితే ఒక్కో రాష్ట్రం ఒక్కో తీరుగా బీసీ వర్గాలకు రిజర్వేషన్లకు కల్పిస్తుండడంపై దేశవ్యాప్తంగా ఏకరూపకంగా అమలు చేసేందుకు సుప్రీంకోర్టు ట్రిపుల్ టీ పేరిట మార్గదర్శకాలను జారీ చేసింది. అందులో భాగంగానే బీసీలకు స్థానికసంస్థల్లో రాజకీయ రిజర్వేషన్ల కల్పనకు డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటును తప్పనిసరి చేస్తూ, మార్గదర్శకాలను జారీ చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ కలుపుకుని మొత్తంగా 50శాతం మించకూడదనే సీలింగ్‌ను సైతం విధించింది. సూటిగా చెప్పాలంటే డెడికేటెడ్ కమిషన్ సిఫారసులు లేకుండా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను బీసీ రిజర్వేషన్లను అనేవి ఉండబోవు. బీసీ కోటా మొత్తాన్ని కూడా జనరల్ స్థానాలుగానే పరిగణించి ఎన్నికలను నిర్వహిస్తారు. గుజరాత్ రాష్ట్రానికి గతంలో సుప్రీంకోర్టు ఇదే విధమైన ఆదేశాలను జారీ చేసింది. న్యాయకోవిదులు, బీసీ మేధావులు ఇంత స్పష్టంగా నొక్కిచెబుతున్నా కూడా కాంగ్రెస్ సర్కారు అందుకు భిన్నంగా ముందుకు సాగుతున్నది.

కులగణనపై పబ్లిక్ జ్యూరీ ప్యానెల్

హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): కులగణన అంశంపై విస్తృతంగా చర్చించేందుకు, మేధావులు, న్యాయకోవిదులతో మేధోమథనం సాగించేందుకు పబ్లిక్ జ్యూరి ప్యానెల్‌ను ఏర్పాటు చేసినట్లు పీపుల్స్ కమిటీ ఆన్ కాస్ట్ సెన్సెస్, తెలంగాణ బీసీ ఉద్యోగుల ఫెడరేషన్ ఒక ప్రకటనలో వెల్లడించింది. ప్యానల్‌లో జస్టిస్ బీ చంద్రకుమార్, బీసీ కమిషన్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఓయూ విశ్రాంత ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వరరావు ఉన్నట్లు వెల్లడించారు. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు బీసీ సంఘాల నేతలు విజ్ఞప్తి చేశాయి.

చంద్రబాబు తెలంగాణకు రావొద్దు

- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తీవ్రహెచ్చరిక
- తిరుమలలో మా లెటర్లు ఎందుకు యాక్సెప్ట్ చేస్తలేరు?
- తెలంగాణ కృష్ణా, గోదావరి నీళ్లు కావాల్నా?: ఎమ్మెల్యే యెన్నం

మహబూబ్‌నగర్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'మా తెలంగాణలో మీకు ఆస్తులు కావాలి.. బిజినెస్‌లు కావాలి.. కానీ మా సిఫార్సు లేఖలు మీ తిరుమలలో నడువవు.. అందుకే చంద్రబాబు నాయుడు తెలంగాణలో అడుగు పెట్టొద్దు' అంటూ జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తీవ్ర స్థాయిలో హెచ్చరించడం చర్చనీయాంశమైంది. మహబూబ్‌నగర్‌లో ముడా చైర్మన్ సన్మాన కార్యక్రమంలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌తో కలిసి తిరుమలలో వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లారు. అక్కడ ఎమ్మెల్యేల ప్రొటోకాల్ విషయంలో టీటీడీ అధికారులు పట్టించుకోకపోవడంతో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి దీనికి వత్తాసు పలుకుతూ.. 119 మంది ఎమ్మెల్యేల మనసులో ఉన్న మాటను జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చెప్పారని, ఆయనకు తామంతా బాసటగా ఉంటామని స్పష్టంచేశారు. 'కృష్ణా, గోదావరి నీళ్లు ఎక్కడి నుంచి వస్తాయి.. మా తెలంగాణ నుంచే కదా? ఇక్కడి నుంచి వచ్చే నీళ్లు కావాలి కానీ.. మా తెలంగాణ ఎమ్మెల్యేలు మీకు వద్దా' అంటూ చురకలంటించారు. ఇదిలా ఉంటే.. కొన్ని రోజులుగా సీఎం ఉమ్మడి జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చంద్రబాబును టార్గెట్ చేస్తూ వ్యాఖ్యానిస్తున్నారు. సీఎం సొంత జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలే బాబును టార్గెట్ చేస్తుండటంతో రేవంత్ అసహనానికి గురవుతున్నట్టు సమాచారం.

చంద్రబాబు ఆలోచనలతో ముందుకెళ్దాం

ఏపీ సీఎంను పొగడ్తలతో ముంచిన విప్ రామచంద్రునాయక్

నర్సింహులపేట, అక్టోబర్ 23: ఏపీ సీఎం చంద్రబాబు మంచి నాయకుడు, ఆయన ఆలోచనలతో ముందుకెళ్దామని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జాటోత్ రామచంద్రునాయక్ పేర్కొన్నారు. గురువారం మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 73 ఏండ్ల వయసులో చంద్రబాబును జగన్ ప్రభుత్వం కుట్రలతో జైలుకు పంపినా ప్రజల ఆదరణతో సీఎం అయ్యారని పొగడ్తలతో ముంచెత్తారు. రాజకీయం కోసం పుట్టిన నేత చంద్రబాబు నాయుడని చెప్పారు. అంతా విన్న కార్యకర్తలు చంద్రబాబు నాయుడు గురించి ఎందుకు చెప్తున్నాడోనని గుసగుసలాడుకున్నారు.

మంత్రి జూపల్లిని బర్తరఫ్ చేయాలి

- ఎమ్మెల్యే బండ్ల కుటుంబంపై విచారణ జరపాలి
- కొల్లాపూర్‌లో అత్యధిక క్రైమ్‌రేటు
- బండ్ల సోదరుడిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలి
- మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): కొల్లాపూర్ నియోజకవర్గంలో క్రిమినల్స్‌కు కొమ్ముకాస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావును మంత్రి పదవి నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి తమ్ముడు రాజశేఖర్‌రెడ్డి ఇంట్లో పనిచేస్తున్న బాలిక ఆత్మహత్యకు కారణమైన బండ్ల కుటుంబంపై సమగ్ర విచారణ జరపాలని, రాజశేఖర్‌రెడ్డిపై కేసు హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి జూపల్లి కేసును పక్కదారి పట్టించేందుకు పోలీసు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని విమర్శించారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో ప్రత్యర్థులపై జూపల్లి కేసులు పెట్టి వేధిస్తున్నారని తెలిపారు. హైదరాబాద్ తెలంగాణభవన్‌లో గురువారం ఆయన బీఆర్ఎస్ నేతలు అభిలాశ్ రంగినేని, కుర్వ విజయ్‌కుమార్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. మంత్రిగా జూపల్లి కృష్ణారావు ఈ 11 నెలల్లో నాలుగు దేశాలు తిరిగి తెలంగాణకు ఏం ఒరగబెట్టారని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డిని తిట్టిన జూపల్లి.. ఇప్పుడు ఆయన మెప్పు కోసం కేటీఆర్, హరీశ్‌రావును విమర్శిస్తున్నారని మండిపడ్డారు. జూపల్లికి రాజకీయ విలువలు లేవని, ఏ ఎండకు ఆ గొడుగు పట్టే వ్యక్తి అని విమర్శించారు. చంద్రబాబు ఆదేశంలో కాంగ్రెస్ పనిచేస్తున్నదని గతంలో మాట్లాడిన జూపల్లి ఇప్పుడు ఎవరి ఆదేశాలతో పని చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. హరీశ్‌రావును విమర్శిస్తున్న జూపల్లి.. కొల్లాపూర్‌ను సిద్దిపేట తరహాలో ఎందుకు అభివృద్ధి చేయడం లేదని నిలదీశారు. కొల్లాపూర్ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. కొల్లాపూర్‌లో శాంతిభద్రతలు దెబ్బతిన్నాయని, అధిక క్రైమ్‌రేటు ఇక్కడే నమోదవుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీధర్‌రెడ్డి హత్య జరిగి ఏడునెలలైనా ఇప్పటివరకు నిందితులను ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు.

బాసర ట్రిపుల్ ఐటీకి హైకోర్టు నోటీసులు

బాసర, అక్టోబర్ 24 : ఫీజు బకాయి ఉన్నదంటూ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదంటూ నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీ యాజమాన్యంపై పూర్వ విద్యార్థి సామల ఫణికుమార్ హైకోర్టు మెట్లెక్కగా.. ఈ కేసు గురువారం విచారణకు వచ్చింది. తనలాగే వేలాది మంది విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా యాజమాన్యం ఇబ్బందులకు గురిచేస్తున్నదని, ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చిన వాళ్లంతా ఉచిత విద్యను అభ్యసించడానికి హక్కు ఉన్నదని, దానికి సంబంధించిన పూర్తి ఫీజు ప్రభుత్వమే భరించాలని పిటిషనర్ తరఫున హైకోర్టు అడ్వొకేట్ చందన వాదనలు వినిపించారు. దీంతో హైకోర్టు నుంచి ట్రిపుల్ ఐటీకి నోటీసులు జారీ అయ్యాయి. హైకోర్టు ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామని ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ తెలిపారు.

ప్రాథమిక, ప్రాథమికోన్నత టీచర్లూ అర్హులే

- సూచనలు జారీ చేసిన చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్

హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు కూడా ఎమ్మెల్సీ ఓటర్లుగా అర్హులేనని రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ గురువారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. 2025న మార్చి 29న ఖాళీ కాబోతున్న వరంగల్, ఖమ్మం, నల్లగొండ మరియు మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గాల ఎన్నికలకు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని టీచర్లను కోరారు.ఈ మేరకు డీఈవోలు, కలెక్టర్లకు సమాచారం అందించినట్టు తెలిపారు.

'బిగ్ బ్రదర్స్'ను కలవండి

మొదటిపేజీ తరువాయి...

కథనం ప్రకారం.. మల్కాజిగిరి జిల్లా మౌలాలి తిరుమలగిరిలోని సర్వే నంబర్ 398, 399, 409, 410, 411/1, 411/2 లలో ఉన్న 19 ఎకరాల 18 గుంటల భూమిని 1968లో తాజ్ ఉన్నిసాబేగం నుంచి రాకేశ్‌రెడ్డి తండ్రి సూర్యనారాయణరెడ్డి కొనుగోలు చేశారు. 1974లో తాజ్ ఉన్నిసాబేగం చనిపోవడంతో భవిష్యత్తులో ఆమె కుటుంబ సభ్యుల నుంచి వివాదాలు ఉండొద్దన్న ఉద్దేశంతో 1977లో ఆమె కుటుంబ సభ్యులతోనూ సూర్యనారాయణరెడ్డి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. 1980లో అప్పటి ప్రభుత్వం ఆ స్థలంలో క్వారీకి అనుమతివ్వడంతో 1997 వరకు క్వారీ నిర్వహించారు. ఆ తర్వాత ఆ స్థలంలో గ్రామ పంచాయతీ అనుమతితో గోడౌన్, డైరీ ఫామ్ నిర్వహించారు. ఈ స్థలానికి గ్రామ పంచాయతీ 43,155,156, 156/1 ఇంటి నంబర్లు కేటాయించి పన్నులు కూడా వసూలు చేసింది.

హైకోర్టులో స్టేటస్ కో

2010లో రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులు ఈ భూములపై అభ్యంతరం వ్యక్తం చేయడంతో హైకోర్టును ఆశ్రయించి స్టేటస్ కో తెచ్చుకున్నట్టు రాకేశ్‌రెడ్డి తెలిపారు. ఆ భూముల విషయం లో జోక్యం చేసుకోవద్దని కోర్టు తన తీర్పులో పేర్కొంది. అప్పటి నుంచి ఆ భూమి లో రాకేశ్‌రెడ్డి కుటుంబం వ్యాపారాలు నిర్వహించుకుంటున్నది.

తాజ్ ఉన్నీసా పూర్వీకులమంటూ కబ్జా

తాము తాజ్ ఉన్నీసాబేగం పూర్వీకులమంటూ హాజీబేగం, మరో ముగ్గురు ఈ నెల 5న ఈ భూమిని కబ్జా చేసేందుకు వందలాది మందితో వచ్చినట్టు రాకేశ్‌రెడ్డి తెలిపారు. దీనిపై పోలీసులను ఆశ్రయిస్తే చర్యలు తీసుకోకపోవడమే కాకుండా తిరిగి కబ్జాదారులకే సహకరించారని ఆరోపించారు. దీంతో తాము రాచకొండ సీపీ సుధీర్‌బాబును ఆశ్రయిస్తే ఆయన కూడా తమకు న్యాయం చేయలేదని వాపోయారు. తాము ఫిర్యాదుల్లో ఉండగానే, మరోవైపు తమ భూమిలోని గోడౌన్లు, షెడ్లను ధ్వంసం చేయడంలో కబ్జాదారులకు పోలీసులు సహకరించారని ఆరోపించారు. గోడౌన్లలో ఉన్న కోట్ల రూపాయల విలువైన మెడికల్ పరికరాలతో పాటు రూ. 3 కోట్ల విలువైన ఆస్తి ధ్వంసమైందని ఆవేదన వ్యక్తం చేశారు.

బిగ్ బ్రదర్స్‌ను కలవమంటున్నారు

ఫిర్యాదు చేసినా పట్టించుకోపోవడంతో ఈ నెల 14న కోర్టును ఆశ్రయించి స్టేటస్ కో తెచ్చుకున్నాం. ఆ ఉత్తర్వులను కూడా పోలీసులు పట్టించుకోవడం లేదు. మమల్ని ఆ స్థలంలోకి రాకుండా అడ్డుకుంటున్నారు. పోలీసులు ఎందుకిలా వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదు. సీపీ సుధీర్‌బాబు మాత్రం బిగ్ బ్రదర్స్‌తోపాటు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును కలవాలని చెప్తున్నారు.

30 ఏండ్లనాటి లేఔట్లపై నిషేధమా?

- హెచ్ఎండీఏకి ముందున్నా ఇదే వైఖరా?
- బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): మూడు దశాబ్దాల నాటి పంచాయతీ లేఔట్లపై ఇప్పుడు నిషేధం విధించడమేమిటని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి గురువారం ఎక్స్ వేదికగా ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికే ఐసీయూలో ఉన్న తెలంగాణ రియల్ ఎస్టేట్ రంగాన్ని శ్మశానానికి పంపే కార్యక్రమం నడుస్తున్నదా? అని ప్రశ్నించారు. హెచ్ఎండీఏ పుట్టక ముందు చేసిన లేఔట్లపైనా ఇప్పుడు నిషేధం విధించడం ఏమిటని ఆశ్చర్యం వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి జీపీ లేఔట్లు ఎందుకు టార్గెట్‌గా మారాయని ప్రశ్నించారు. '2007, 2012లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వమే లేఔట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్), బిల్డింగ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (బీఆర్ఎస్) తెచ్చి, జీపీ లేఔట్ ప్లాట్ల రెగ్యులరైజేషన్ పేరిట వేల కోట్లు దండుకొన్నదని ధ్వజమెత్తారు. ఇప్పుడు వాటిపైనే నిషేధం అంటే ఆ రెగ్యులరైజేషన్ పట్టాలు చిత్తు కాగితాలా? అని ప్రశ్నించారు. ఏ ప్రాతిపదికన ప్రభుత్వం ఈ నిషేధిత జాబితా తయారుచేసిందని, ఈ జాబితాలో అన్ని జీపీ లేఔట్లు ఎందుకు లేవని ప్రశ్నించారు. ఇప్పటికే ఇండ్లు కట్టుకొని లోన్లు తీసుకున్న వారి పరిస్థితి ఏమిటని నిలదీశారు. ఆగమైతున్న తెలంగాణను రక్షించండి.. అని సతీశ్‌రెడ్డి కోరారు.

మెయిన్‌హార్ట్‌కు క్షమాపణలు చెప్పేదే లేదు

లీగల్ నోటీసులకు బీఆర్ఎస్ లీగల్ టీమ్ సమాధానం

హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): మెయిన్‌హార్ట్ సంస్థకు బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమాపణలు చెప్పబోరని ఆ పార్టీ లీగల్ టీమ్ గురువారం స్పష్టం చేసింది. మెయిన్‌హార్ట్‌పై చేసిన ఆరోపణలకు క్రిశాంక్ కట్టుబడే ఉన్నారని పేర్కొంది. ఆ సంస్థ